క్లుప్తంగా

పశువులకు కూడా హెల్త్ కార్డులు



పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్ మురళీకృష్ణ

జే.పంగులూరు: ప్రభుత్వం మనుషులకు ఆరోగ్య శ్రీ కార్డులు ఇచ్చి నట్లుగానే, ఇక నుంచి పశువులకు కూడా హెల్త్ కార్డులు ఇస్తున్నట్లు పంగులూరు పశువైద్యుడు డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. పశువులతో పాటు గొర్రెలు, మేకలకు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం పంగులూరు పశువుల హాస్పిటల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ పశువుల చెవులకు వేసిన ట్యాగ్‌ల నంబర్లను పశువుల హెల్త్ కార్డులులో వేసి, కార్డును ఆ పశుపోషకుడికి ఇస్తామని తెలిపారు. పశువును హాస్పిటల్‌కు తీసుకొచ్చినప్పుడు కార్డు కూడా తీసుకురావాలని తెలిపారు. ఈ కార్డు ద్వారా నట్టల నివారణ, గాలి కుంటు వ్యాధి, గొంతువాపు వ్యాధి, బ్రుసెల్లా ఇతర వ్యాధులకు వైద్యం చేయించుకోవచ్చని సూచించారు.

ఒంగోలు వెళ్లి పింఛన్ పంపిణీ



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఖాసింవలి

అద్దంకి రూరల్: వలంటీర్ల సేవల వల్ల ఎంతో మందికి మేలు జరిగిందనడానికి ఎన్నో సంఘటనలు మనం చూస్తూనే ఉన్నాం. సేవ చేయాలనే తపన తప్ప మరింకేదో ఆశించలన్న ఉద్దేశం వలంటీర్లకు లేదు. దీనికి ఉదాహరణే దివ్యాంగ వలంటీర్ అయిన షేక్ ఖాసింవలి. అద్దంకిలోని 7వ సచివాలయంలో వలంటీర్‌గా సేవలందిస్తున్నాడు. ఒంగోలు రిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న షేక్ రసూల్‌కు వలంటీర్ షేక్ ఖాసింవలి అక్కడకు వెళ్లి శుక్రవారం పింఛన్ అందజేశాడు. ప్రజా సేవ చేయడానికి అంగవైకల్యం అడ్డురాదని చాటి చెప్పాడు వలంటీర్ ఖాసింవలి. దీంతో లబ్ధిదారులు అతడి సేవకు అభినందనలు తెలిపారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

చీరాల రూరల్: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు–2023 ను రద్దుచేయాలని కోరుతూ శుక్రవారం చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి కోర్టు ప్రాంగణంలోని న్యాయ దేవత విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, సీనియర్ న్యాయవాదులు బండారుపల్లి హేమంత్ కుమార్, కరేటి రవికుమార్ రెడ్డి, టిజే. సాయిబాబు, ఆసాది సత్యనారాయణ రెడ్డి, శ్రీకాంత్ ఠాకూర్‌లు మాట్లాడారు. ప్రభుత్వం కొత్తగా తెచ్చిన యాక్టు ప్రకారం ప్రజలు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. తక్షణమే యాక్టును రద్దు చేయాలని వారు కోరారు.

రబీ ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

అద్దంకి: రబీ ఈ–క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించామని.. ప్రతి రైతు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. శనగ విత్తనం ఎదబెట్టేవారు, వరి పంట కోసేవారు, ఆయా పనులను వాయిదా వేసుకోవాలని సూచించారు.

తుపాను హెచ్చరిక..

రానున్న మూడు రోజుల్లో మిచౌంగ్ తుఫాన్ కారణంగా భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున శనగ విత్తనం, వరి కోతలను వాయిదా వేసుకోవాలని కోరారు. లోతట్టు ప్రాంత పొలాల రైతులు వర్షం నీరు బయటకు పోయేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సూచనలను రైతులు పాటించాలన్నారు.

సామాజిక తనిఖీ తేదీ మార్పు

సంతమాగులూరు(అద్దంకి): అనివార్య కారణాల వల్ల మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నేడు శనివారం నిర్వహించాల్సిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని 3వ తేదీకి వాయిదా వేశా ని ఏపీవో నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆడుదాం ఆంధ్రా విజయవంతం చేయాలి



బల్లికురవలో సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి

బల్లికురవ: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ, యువకులకు క్రీడలపై ఆసక్తి పెంచేందుకు ప్రవేశ పెట్టిన ఆడుదాం ఆంధ్రా విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి బాల సుబ్రమణ్యం కోరారు. శుక్రవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా, గృహనిర్మాణాలపై సచివాలయలాల వారీగా సమీక్షించారు. ఆడుదాం ఆంధ్రాను సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, క్రీడలకు కావాల్సిన కిట్లను అందజేసిందని ప్రత్యేకాధికారి అన్నారు. ఈనెల 15 నుంచి 20 వరకు గ్రామస్థాయిలో, 21 నుంచి జనవరి నాలుగు వరకు మండల స్థాయిలో 5 నుంచి 10 వరకు నియోజకవర్గస్థాయి 11 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలో 22 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు జరుగుతాయన్నారు. సమీక్షలో బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు చింతల పేరయ్య, ఎంపీడీవో బ్రహ్మయ్య, తహశీల్దార్ కె. రవిబాబు, మండలస్థాయి అధికారులు, సెక్రటరీలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వీవోఏలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమేద్దాం

- జాగ్రత్తలతో ఎయిడ్స్ నివారణ సాధ్యం
- ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ర్యాలీలు



మేదరమెట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

అద్దంకి/మేదరమెట్ల: ప్రపంచాన్ని భూతంలా పట్టి పీడిస్తున్న ఎయిడ్స్ మహమ్మారిని తరిమేద్దామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎయిడ్స్‌పై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదన్నారు. రోగుల గోప్యతను భంగపరచే విధంగా ఎవరూ ప్రవర్తించవద్దని, ఎయిడ్స్ సోకిన వారిని కుటుంబంలో ఒకరిగా పరిగణించకుండా నిరాదరణకు గురిచేయవద్దన్నారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ లక్కెనబోయిన ఎస్తేరమ్మ మాట్లాడుతూ ఎయిడ్స్ రోగులకు కూడా జీవించే హక్కుందన్నారు. ఎవరూ కూడా వారిని అపహాస్యానికి గురిచేయవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీదేవి, వైస్ చైర్మన్లు దేశు పద్మేశ్, కే అనంతలక్ష్మి, కౌన్సిలర్లు, అధికారులు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

■ ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని కట్టా రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావు అన్నారు. కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, బోటనీ, జువాలజీ, జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ తీసుకోవాలని మేదరమెట్ల యర్రం చినపోలిరెడ్డి ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ నిఖిలారెడ్డి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశలు పాల్గొన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్షత చూపించకూడదని వారికి ఆత్మస్థైర్యం కలిగించాల్సిన బాధ్యత ఉందని హెల్ప్ టీవి మేదరమెట్ల ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ సాగర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ దినం పురస్కరించుకొని మేదరమెట్ల ఆర్టీసీ బస్టాండ్లో సంతకాల సేకరణ చేశారు.

హెచ్ఐవీపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు..

స్వర్ణ (కారంచేడు): హెచ్ఐవీ, ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులపై ప్రజలతో పాటు, విద్యార్థులు కూడా సరైన అవగాహన కలిగి ఉండాలని హెచ్ఎం ఎంవీ సుబ్బారావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ సిబ్బంది గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎయిడ్స్, హెచ్ఐవీపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్‌టీ బయ్యా శంకర్, కమల్, ఎల్‌కే ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు మండలంలోని ఇడుపులపాడు ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్ఎం పిడపర్తి పేరిరెడ్డి ఎయిడ్స్‌పై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పర్వతనేని పావని, భవనం శివలీల, పెంట్యాల పావని, బండారు అనీల్, గోరంట్ల సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలి..

పర్చూరు (చినగంజాం): ఎయిడ్స్ ప్రాణాంతకమైన వ్యాధి అని, దీని పట్ల ప్రజలు సరైన అవగాహన కలిగి ఉండాలని పర్చూరు కోర్టు సివిల్ జడ్జి కే ప్రశాంతి అన్నారు. శుక్రవారం ఆమె ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఎయిడ్స్‌కు మందు లేదని, నివారణ మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ గురుమహేశ్వరరెడ్డి, న్యాయవాది రవీంద్రారెడ్డి, వైద్యులు, ప్రజలు పాల్గొన్నారు.



ఇడుపులపాడులో హెచ్ఐవీ సింబల్‌లో విద్యార్థులు



మాట్లాడుతున్న జడ్జి ప్రశాంతి



అద్దంకి: మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు



అద్దంకి: మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు



స్వర్ణలో విజేతలకు బహుమతులు అందిస్తున్న హెచ్ఎం, ఎల్‌టీలు

అద్దంకి పట్టణాభివృద్ధికే ప్రాధాన్యత



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న కృష్ణచైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణాభివృద్ధే ధ్యేయంగా కృషిచేస్తానని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. శుక్రవారం పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. దీనిలో భాగంగా శింగరకొండ సమీపంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద వాటర్ ఫౌంటేన్ ఏర్పాటు కావాల్సిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావును కోరారు. రేణింగవరం రోడ్డులోని ఎన్ఎస్‌పీ కాలువ మీదుగా మీనాక్షి రెస్టారెంట్ వరకు ఉన్న రోడ్డును మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్యతో కలిసి పరిశీలించారు. ఊరచెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను, కాకాని పాలెంలో వెంకటేశ్వరస్వామి దేవస్థాన నిర్మాణ పనులు, గరటయ్య కాలనీ ప్రాథమిక పాఠశాల నుంచి డొంక వరకు సర్వే చేయించాలని రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. అనంతరం కాకానిపాలెం మండపం నుంచి నార్కెట్‌పల్లి నామ్ రహదారి రోడ్‌ను విస్తరణ పనులను పర్యవేక్షించారు. పట్టణంలోని 7 వవార్డులోని వాగు, భవనాసి కాలువ నుంచి ఎరుకల కాలనీ, నర్రావారి పాలెంలోని శ్మశాన వాటికలను ఆయన పరిశీలించారు. కార్యక్రమాల్లో ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎల్. ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్‌లు పద్మేష్, అనంతలక్ష్మీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధకృష్ణ మూర్తి, కౌన్సిలర్‌లు, వార్డు ఇన్‌చార్జులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

చీరాల టౌన్: ప్రభుత్వం అందించే పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించే బాధ్యత అధికారులపై ఉంది.. అధికారులు విధులను సక్రమంగా, సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో నేతాజీ సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అన్నీ సచివాలయాల సెక్రటరీలు, వివిధ శాఖల ఉద్యోగులతో ఎంపీడీవో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. మండలంలోని 15 గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు, ఎన్ఆర్ఈజీఎస్ పనుల వివరాలు, కూలీల జాబ్‌కార్డులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలు అందరికీ పనులు కల్పించాలన్నారు. మండలంలో ఉన్న అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులు అందరు సమన్వయంగా పనిచేసి ప్రభుత్వం అందించే పథకాలను అర్హులైన ప్రతి పేదవాడికి అందించాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్మూలన కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో నేతాజీ సూచించారు. ఎంపీడీవోతో పాటుగా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నేతాజీ

సమాజ సేవలో రోటరీ ముందంజ

జే.పంగులూరు: కలివిడి వాతావరణం గ్రామీణ ప్రాంతాల్లోనే కాక రోటరీ క్లబ్‌లలో కూడా ఉంటుందని రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ భూషిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పంగులూరు రోటరీక్లబ్‌ను శుక్రవారం రోటరీ గవర్నర్ అధికారి పర్యటన జరిగింది. కార్యక్రమంలో ముందుగా రోటరీ క్లబ్ బిల్డింగ్ చుట్టూ రూ. 4 లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మించారు. ఈ ప్రహరీను రోటరీ గవర్నర్ శంకర్ రెడ్డి ప్రారంభించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రొటేరియన్లు ఆర్థికంగా స్థిర పడితేనే ఎక్కువ డబ్బులు వెచ్చించి సేవా కార్యక్రమాలు చేయవచ్చన్నారు. ఇప్పటికే పంగులూరు రోటరీ క్లబ్ నుంచి ఎక్కువగా శుక్లాల ఆపరేషన్లు జరిగాయన్నారు. రోటరీ భవన నిర్మాణానికి సహకరించిన అప్పటి అధ్యక్షుడు రాయిణి వెంకట సుబ్బారావుని, ప్రహరీ నిర్మాణానికి పోత్సహించిన ప్రస్తుత అధ్యక్షుడు కరణం హనుమంతురావుని అభినందించారు. పంగులూరు రోటరీ క్లబ్‌నుంచి ఎలాంటి ప్రాజెక్ట్ వచ్చిన సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు, పంగులూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు కరణం హనుమంతురావు, కార్యదర్శి కాలేషావలి, ట్రెజరర్ గుర్రం ఆంజనేయులు, రొటేరియన్లు వీరరాఘవయ్య, జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



రోటరీ భవన ప్రహరీని ప్రారంభిస్తున్న గవర్నర్ శంకర్‌రెడ్డి

సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ కృషి



యూటీఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న బండి భిక్షాలు

కారంచేడు: ఉపాధ్యాయుల సమస్యల సత్వర పరిష్కారంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఎప్పుడూ ముందు వరుసలోనే ఉంటుందని యూటీఎఫ్ బాపట్ల జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు బండి భిక్షాలు బాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం కారంచేడు మండల యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం యూపీ పాఠశాలలలో నిర్వహించారు. ఈసమావేశంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ రావి పద్మావతి మాట్లాడుతూ హక్కులు, బాధ్యతలు రెండు కళ్లగా నడుచుకొనే సంఘం యూటీఎఫ్ అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. పలు డిమాండ్లను యూటీఎఫ్ తీర్మానించింది. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ రమేష్‌రెడ్డి, పావులూరి శ్రీనివాస రావు, భవనం శ్రీనివాసరెడ్డి, భవానీప్రసాద్, ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్జీల విచారణలో ఉద్యోగులకు అలసత్వం తగదు

చీరాల టౌన్: ప్రజలకు ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది అలసత్వం వహించకుండా నిబద్ధతతో పనిచేయాలని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. రెవెన్యూ కార్యాలయంలోని సమావేశపు హాలులో శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరగా విచారణలు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు ప్రజలతో సత్సంబంధాలు కలిగిన జవాబుదారీగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం అందించే రెవెన్యూ సేవలను అందరికీ అందించాలన్నారు. సమావేశంలో డీటీ సురేష్, ఆర్ఐలు శేఖర్, అర్జున్, సర్వేయర్ ఆంజనేయులు, వీఆర్వోలు ఉన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం, కార్తీక మాసం, పుష్యమి నక్షత్రం, పంచమి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శుక్రవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత

- రెట్టించిన ఉత్సాహంతో 'వై ఏపీ నీడ్స్ జగన్'



ఇడుపులపాడులో అభివృద్ధి చార్ట్‌ను విడదల చేస్తున్న అధికారులు, నాయకులు

చీరాల: రాష్ట్రాభివృద్ధితో పాటుగా రాష్ట్ర ప్రజల సంక్షేమానికి సమంగా ప్రాధాన్యతనిచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చూసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని క్లస్టర్–1లోని హరిప్రసాద్‌నగర్, క్లస్టర్–2లోని బోసునగర్ సచివాలయాల పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనన్నే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను రూపొందించి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ద్వారా అందరికి పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బీ జైసన్‌బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు కీర్తి వెంకటరావు, బత్తుల అనీల్, కె.అరుణ్, టి.అనీల్, ఎం.స్వాతి, పట్టణాధ్యక్షులు కొండ్రు బాబ్జి, పార్టీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయల కన్వీనర్లు, ప్రజలు పాల్గొన్నారు. అలానే దేవాంగపురి–2 సచివాలయ పరిధిలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు ఎ.అంకాళరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బి.సాంబశివరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన సీఎం జగన్..

బల్లికురవ: ఇచ్చిన హామీలతో పాటు చెప్పని సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని రెండోసారి సీఎంగా గెలిపించుకోవాలని జిల్లా, మండలపార్టీ అధ్యక్షుడు చింతల పేరయ్య అన్నారు. ముక్తేశ్వరం సచివాలయంలో పార్టీ జెండా, డిస్ ప్లే బోర్డులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి బాలసుబ్రహ్మణ్యం, ఎంపీడీవో బ్రహ్మయ్య, ఈవోఆర్డీ సుమతి, మండల ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, సర్పంచ్ ఎం లక్ష్మీ, జేసీఎస్ అధ్యక్షుడు టి నరేష్, స్థానిక నేతలు కె. శంకరరెడ్డి శ్రీనువలి, ఎం. వెంకటేశ్వర్లు, బాజీ తదితర నేతలు పాల్గొన్నారు.

ఇంకొల్లు (చినగంజాం)/మార్టూరు: ప్రభుత్వం పేద ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేర్పించడమే బాధ్యతగా ప్రతి ఒక్కరు కృషి చేయాల్సి ఉందని ఇంకొల్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు అన్నారు. మండలంలోని ఇడుపులపాడు–2 గ్రామ సచివాలయ ప్రాంగణంలో సర్పంచ్ బండారు సుమతీ జక్రయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మస్తాన్‌వలీ, మాజీ జెడ్పీటీసీ సభ్యులు నూతలపాటి బలరాం, ఎంపీటీసీ సభ్యుడు గుంజి బాబు, అట్లూరి కోటేశ్వరరావు, కే వెంకటేశ్వరరెడ్డి, జాగర్లమూడి శ్రీను, ఆరే రాఘవేంద్ర, ఆరే అంకిరెడ్డి, కార్యదర్శి శేషగిరిరావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

■ మార్టూరు మండలంలోని జొన్నతాళి గ్రామంలో ఏపీకి ఎందుకు సీఎం అవసరం అనే కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, సచివాలయ పరిధిలో లబ్ధిదారులకు అందిన రూ 19.40 కోట్ల వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పఠాన్ కాలేషావలి, గడ్డ మస్తాన్ వలీ, నాయకులు నాగిరెడ్డి, రోశిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కోటిరెడ్డి, స్వప్న, గ్రామస్తులు పాల్గొన్నారు.



పథకాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ జంజనం, కౌన్సిలర్లు



ముక్తేశ్వరంలో పథకాల జాబితా ఆవిష్కరిస్తున్న పేరయ్య, నాయకులు



జొన్నతాళిలో పథకాల బోర్డు ప్రదర్శిస్తున్న నాయకులు

రసాయన శాస్త్రంలో ప్రతాప్‌కుమార్‌కు డాక్టరేట్



ప్రతాప్‌కుమార్

చీరాల రూరల్: చీరాలలోని పేరాల శృంగారపేటకు చెందిన కొప్పోలు ప్రతాప్‌కుమార్‌కు మచిలీపట్నం కృష్ణా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్రంలో డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈయన ప్రస్తుతం ప్రకాశం జిల్లా దోర్నాల ప్రభుత్వ కళాశాలలో రసాయన శాస్త్రం విభాగాధిపతిగా, అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన రసాయన శాస్త్రంలో సింథసిస్ క్యారక్టరైజేషన్ అండ్ ఆప్టిమైజేషన్ ఆఫ్ ఎఫ్ఈ బేస్డ్ నానోపార్టికల్స్ ఫర్ దెయిర్ యూజ్‌ఫుల్ అప్లికేషన్స్ అనే అంశంపై పరిశోధనాత్మక గ్రంథం సమర్పించినందుకుగాను కృష్ణా విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు పర్యవేక్షణలో పరిశోధనలు కొనసాగించినట్లు ప్రతాప్ కుమార్ తెలిపారు. అలానే జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో తన రీసెర్చ్ ఆర్టికల్స్ పబ్లిష్ అయినట్లు చెప్పారు.

నేడు గ్రంథాలయంలో ఉచిత పుస్తకాలు పంపిణీ

వేటపాలెం: స్థానిక సారస్వత నికేతనం గ్రంథాలయంలో ఈ నెల 2, 3 తేదీల్లో రెండు రోజుల పాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు గ్రంథాలయ పాలకవర్గ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చదువుకోవాలనుకొనే వారికి పుస్తకాలు కొనే స్తోమత లేని వారికి ఉచితంగా పుస్తకాలు అందించడం ద్వారా మరింత విజ్ఞానాన్ని మరింత మందికి అందించాలనే ధ్యేయంతో ఇటువంటి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉచిత పుస్తకాల ప్రదర్శనలో భక్తి, ఆధ్యాత్మిక గ్రంథాలు, కథలు, నవలలు, వార, మాసపత్రికలు, ఎంసెట్, పోటీ పరీక్షలకు ఉపయోగపడే గైడ్లు, తెలుగు సాహిత్యం, భాషకు సంబంధించిన మరెన్నో పుస్తకాలు ప్రదర్శలో ఉంచుతామని తెలిపారు. పుస్తకాలపై ఆసక్తగల వారికి కేవలం ఐదు పుస్తకాలను ఉచితంగా తీసుకొవచ్చని తెలిపారు. మీ వద్ద ఉపయోగించుకోకుండా ఉన్న పుస్తకాలను సారస్వత నికేతన గ్రంథాలయానికి ఇవ్వడం ద్వారా మీరు కూడా మంచి కార్యక్రమంలో భాగస్వాములు కావచ్చని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగించు కోవాలని పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు.

త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ఉమ

మేదరమెట్ల: జగనన్న కాలనీల్లోని ఇంటి నిర్మాణాలను జనవరి నెలాఖరు లోగా పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి ఉమ అన్నారు. కొరిశపాడు మండల కార్యాలయంలో పంచాయతీ, సచివాలయాల సిబ్బందితో ఆమె సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 224 ఇంటి నిర్మాణాల లక్ష్యం ఉందని వీటిని జనవరి నెలాఖరులోగా పూర్తి చేయించే విధంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అలాగే రానున్న సంవత్సరంలో గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించడం, గ్రామ సభలు ఏర్పాటు చేసుకొని అభివృద్ధి పనులపై చర్చించి ఆమోదాలు తీసుకోవాలన్నారు. అందుకు సంబంధించిన ప్రణాళిక తయారు చేసుకోవాలని మండల అధికారులను ప్రత్యేకాధికారి సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో సురేష్‌బాబు, తహశీల్దార్ సుశీల, హౌసింగ్ ఏఈ నటరాజ్, పలు శాఖల ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.